# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY


## జిల్లాలో గురువారం 20 గ్రామాలలో రెవెన్యూ సదస్సుల నిర్వహణ

కర్నూలు, డిసెంబర్ 25 :- జిల్లాలో గురువారం 20 ఆ గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నారు...ఆదోని రెవెన్యూ డివిజన్ లోని గోనెగండ్ల మండలంలోని పెద్ద మర్రివీడు గ్రామం, నందవరం మండలంలోని జోహారపురం గ్రామం, ఎమ్మిగనూరు మండలంలోని కందనాతి గ్రామం,కోసగి మండలం లోని సజ్జలగూడెం గ్రామం, కౌతాళం మండలంలోని పోడలకుంట గ్రామం,మంత్రాలయం మండలంలోని బసాపురం ఎండపల్లి గ్రామం, హోలగుంద మండలంలోని హోళగుంద గ్రామం, కౌతాళం మండలంలోని మదిరి గ్రామం.కర్నూలు రెవెన్యూ డివిజన్లో ని ఓర్వకల్లు మండలంలోని తిప్పయ్య పల్లి గ్రామం, కల్లూరు మండలంలోని బస్తిపాడు గ్రామం, వెల్దుర్తి మండలం లో నర్లాపురం గ్రామం, కర్నూలు రూరల్ లోని ఎదురూరు గ్రామం,పత్తికొండ రెవెన్యూ డివిజన్లోని తుగ్గలి మండలంలోని తుగ్గలి గ్రామం, ఆలూరు మండలంలోని కమ్మరిచేడు గ్రామం







PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర్ రెడ్డి గురువారం 26-12-2024 సంపుటి : 06 సంచిక : 82 పేజీలు : 8 వెల : రూ 3-00


## కెన్-బెత్వా నధుల అనుసంధాన ప్రాజెక్టును ప్రారంభించిన మోదీ







ఖజురహో: నధుల అనుసంధానంలో మొదటిదైన కెన్-బెత్వా నధుల అనుసంధాన ప్రాజెక్టును ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మధ్యప్రదేశ్‌లోని ఖజురహో లో బుధవారంనాడు ప్రారంభించారు. రెండు నదుల జలాలను ఆయన ప్రాజెక్టు నమూనాలో పోశారు. అనంతరం రిమోట్ బటన్ సాయంతో ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ శత జయంతిని పురస్కరించుకుని మోదీ ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. కెన్-బెత్వా రీవర్ లింకింగ్ నేషనల్ ప్రాజెక్టు ద్వారా మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్‌లోని వివిధ జిల్లాలకు ఇరిగేషన్ సౌకర్యాలు అందుబాటులోకి వచ్చి లక్షలాది మంది రైతు కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది. తాగునీటి సౌకర్యం కూడా ఈ ప్రాంత వాసులకు లభ్యమవుతుంది.ప్రాజెక్టు శుంకుస్థాపన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మోదీ మాట్లాడుతూ, ఈరోజు యావత్ ప్రపంచం క్రిస్మమ్ వేడుక జరుపుకుంటోందని, దేశవిదేశాల్లోని క్రైస్తవులందరికీ శుభాకాంక్షలని అన్నారు. ముఖ్యమంత్రి మోహన్ లాల్ యాదవ్ సారధ్యంలోని మధ్యప్రదేశ్ ప్రభుత్వం ఈ రోజుతో ఏడాది పూర్తి చేసుకుంటున్నందున ఆయనకు, బీజేపీ కార్యకర్తలకు, రాష్ట్ర ప్రజలకు అభినందలు తెలియజేస్తున్నానని చెప్పారు. గత ఏడాది అభివృద్ధి కొత్త పుంతలు తొక్కిందని, ఈరోజు కోట్లాది రూపాయలు విలువజేసే అభివృద్ధి ప్రాజెక్టులను శంకుస్థాపన చేస్తున్నామని చెప్పారు. కెన్-బెత్వా రీవర్ లింకింగ్ ప్రాజెక్టును కూడా ఇక్కడ శంకుస్థాపన చేస్తున్నామన్నారు. ఇదేరోజు భారతరత్న వాజ్‌పేయి శతజయంతి ఉత్సవాలు జరుపుకొంటున్నామని, ఇది సుపరిపాలన పండుగని, సుపరిపాలన అంటేనే బీజేపీ అని మోదీ అన్నారు.ఈ సందర్భంగా మధ్యప్రదేశ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ మాట్లాడుతూ, బుందేల్‌ఖండ్ ప్రజలకు ఏళ్ల తరబడి కాంగ్రెస్ అబద్ధాలు చెబుతూ వచ్చిందన్నారు. ఈ ప్రాంతానికి ప్యాకేజీ ఇస్తామని హామీలు ఇచ్చి నెరవేర్చలేదన్నారు. ఈరోజు బుందేల్‌ఖండ్‌లోని 11 జిల్లాలకు తాగునీరు, ఇరిగేషన్, ఇండస్ట్రీలకు జలాలు అందనున్నాయని చెప్పారు.

వాజ్‌పేయి స్మారక స్టాంపు విడుదల

కెన్-బెత్వా రివర్ లింగ్ ప్రాజెక్టు సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వాజ్‌పేయి శతజయంతిని పురస్కరించుకుని స్మారక తపాలా బిళ్లను, రూ.100 నాణేన్ని మోదీ విడుదల చేశారు. అటల్ గ్రామ్ సుశాన్ బిల్డింగ్‌లకు ప్రధాని శంకుస్థాపన చేశారు.

## ప్రధాని మోదీతో సీఎం చంద్రబాబు భేటీ



న్యూఢిల్లీ, డిసెంబర్ 25: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి న్యూఢిల్లీ పర్యటన బిజీ బిజీగా సాగుతోంది. అందులోభాగంగా ప్రధాని నరేంద్ర మోదీతో సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర పరిస్థితులతోపాటు ఏపీ అభివృద్ధికి సంబంధించిన అంశాలను ఈ సందర్భంగా ప్రధాని దృష్టికి సీఎం చంద్రబాబు తీసుకు వెళ్లినట్లు తెలుస్తోంది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 1వ తేదీన పార్లమెంట్‌లో కేంద్ర వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈ నందర్భంగా రాష్ట్ర ప్రయోజనాలకు సంబదించిన అంశాలతో పాటు కేంద్ర ప్రభుత్వ పథకాలకు రాష్ట్ర ప్రభుత్వ వాటా, నిధుల కేటాయింపులపై ప్రధానితో సీఎం చంద్రబాబు సమగ్రంగా చర్చించినట్లు సమాచారం.అలాగే అమరావతి నిర్మాణానికి గత మధ్యంతర బడ్జెట్‌లో రూ.15 వేల కోట్ల ఆర్థిక సాయాన్ని ప్రతిపాదించారని.. దీనిని వేగవంతం చేయాలని ఈ సమావేశంలో ప్రధాని మోదీని సీఎం చంద్రబాబు కోరినట్లు తెలుస్తోంది. విశాఖపట్నం రైల్వే జోన్ శంకుస్థాపన కార్యక్రమానికి ప్రధాని మోదీని సీఎం చంద్రబాబు ఆహ్వానించారు. ఇక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జీవనాడి పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణానికి సహకారం అందించడంతోపాటు వరద సెస్‌కు అనుమతి ఇవ్వాలని ప్రధాని మోదీకి సీఎం చంద్రబాబు విజ్ఞప్తి చేశారు.ఇక రాష్ట్రంలో చేపట్టనున్న నూతన ప్రాజెక్టులకు ఆర్థిక సహాయ సహకారాన్ని సైతం ఈ సందర్భంగా ప్రధానికి సీఎం వివరించారు. మరోవైపు ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో సైతం సీఎం చంద్రబాబు భేటీ కానున్నారు. ఇంకోవైపు ఇప్పటికే కేంద్ర మంత్రులు అమిత్ షా, జేపీ నడ్డా, అశ్వినీ వైష్ణవ్‌లతో సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు.

## శ్రీతేజ్ కుటుంబానికి రూ.2 కోట్ల పరిహారం : అల్లు అరవింద్




హైదరాబాద్,ఆర్‌టీసీ క్రాస్ రోడ్స్‌లోని సంధ్య థియేటర్ వద్ద డిసెంబర్ 4న రాత్రి జరిగిన తొక్కిసలాట ఘటనలో రేవతి అనే మహిళ మృతి చెందగా.. ఆమె కుమారుడు శ్రీతేజ్ కు గాయాలవగా.. ప్రస్తుతం శ్రీతేజ్ కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా ఇవాళ ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు, నిర్మాత అల్లు అరవింద్ తో కలిసి కిమ్స్ ఆస్పత్రిలో శ్రీతేజ్‌ను పరామర్శించారు. కుటుంబసభ్యులు, డాక్టర్లతో మాట్లాడి శ్రీతేజ్ ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా రేవతి కుటుంబానికి పుష్ప టీం రూ.2 కోట్లు పరిహారం ప్రకటించింది. అల్లు అర్జున్ రూ.కోటి, సుకుమార్ రూ.50 లక్షలు, మైత్రీ మూవీ మేకర్స్ రూ.50 లక్షలు ప్రకటించగా.. పరిహారం చెక్కులను అల్లు అరవింద్ ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజుకు అందజేశారు. ఈ మేరకు అల్లు అరవింద్, దిల్ రాజు కలిసి శ్రీతేజ్ కుటుంబసభ్యులకు నేడు చెక్కు అందజేశారు.ఈ సందర్భంగా శ్రీతేజ్ కుటుంబానికి మా తరపున మొత్తం రూ.2 కోట్ల పరిహారం అందజేస్తున్నామని.. శ్రీతేజ్ కోలుకుంటున్నాడని అల్లు అరవింద్ అన్నారు. శ్రీతేజ్ త్వరలోనే పూర్తిగా కోలుకుంటున్నామని ఆశిస్తున్నామన్నారు. అనంతరం దిల్ రాజు మాట్లాడుతూ..శ్రీతేజ్ త్వరగా కోలుకుంటున్నాడు. నిన్నటి నుంచి ఇప్పటివరకు రికవరీ వేగంగా ఉందన్నారు. శ్రీతేజ్ 72 గంటల నుంచి వెంటిలెటర్ లేకుండా ఉన్నాడు. పరిహారం సొమ్ము సద్వినియోగం అయ్యేలా చర్యలు తీసుకుంటామని అన్నారు.

## భక్తులతో కిటకిటలాడిన ఇంద్రకీలాద్రి

అమరావతి,డిసెంబర్ 25 : భవానీ దీక్షల విరమణ చివరి రోజు కావడంతో విజయవాడలోని ఇంద్రకీలాద్రి భక్తులతో కిటకిటలాడింది. బుధవారం తెల్లవారుజాము నుంచే భవానీ భక్తులు కృష్ణానది ఒడ్డున స్నానం ఆచరించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అన్ని క్యూలైన్‌లల్లో ఆలయ అధికారులు భక్తులకు ఉచిత దర్శనం కల్పించారు. క్యూలో నిలుచున్న భక్తులకు 2 నుంచి 3 గంటల సమయం పడుతుందని ఆలయ అధికారులు వివరించారు.అమ్మవారి దర్శనం అనంతరం భవానీ ఘాట్, పున్నమి ఘాట్, సీతమ్మవారి పాదాల సమీపంలో ఏర్పాటుచేసిన తాత్కాలిక కేశఖండన శాల వద్ద దీక్షాదారులు తలనీలాలు సమర్పించుకున్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, ఒడిశా నుంచి భవానీలు ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు.భవానీ దీక్షాదారులు వయసుతో తారతమ్యం లేకుండా ఏడు కిలోమీటర్లు గిరి ప్రదక్షిణ చేశారు. భవానీలతో పాటు వారి కుటుంబ సభ్యులు కూడా పాల్గొన్నారు. ఆలయ ఈవో రామారావుతో పాటు విజయవాడ నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు, సంబంధిత శాఖల అధికారులు సెంట్రల్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి భక్తుల రద్దీ, దర్శనాలు, ఇతర సౌకర్యాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఈనెల 21న ప్రారంభమైన దీక్షల విరమణ బుధవారంనాటితో ముగుస్తుంది.

## ఏపీలో కూడా టికెట్లను పెంపుదల చేయొద్దు : సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ



అమరావతి,డిసెంబర్ 25 : తెలంగాణ తరహాలో ఏపీలో కూడా టికెట్ల ధరల పెంపునకు, బెనిఫిట్ షోలకు అనుమతులు ఇవ్వద్దని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడిని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ కోరారు. పెద్ద హీరోల సినిమాలకు టికెట్ల ధరలను ఇబ్బడిముబ్బడిగా పెంచడం పరిపాటిగా మారిందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇది ప్రేక్షకుల జేబులు కొల్లగొట్టడమేనని అభిప్రాయపడ్డారు. అందుకే టికెట్ ధరలను పెంచడం, బెనిఫిట్ షోలకు అనుమతించే విధానాలను సీపీఐ తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఈ మేరకు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడికి కె.రామకృష్ణ ఓ లేఖ రాశారు.పెద్ద హీరోల సినిమాలకు టికెట్ల ధరలను ఇబ్బడిముబ్బడిగా పెంచుతూ, ప్రత్యేక ప్రదర్శనలకు అనుమతినిస్తూ జీవోలు జారీ చేడయం పరిపాటిగా మారిందని సీపీఐ ఏపీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. ఇది ప్రేక్షకుల జేబులను కొల్లగొట్టడమే అని అభిప్రాయపడ్డారు. పెద్ద హీరోల సినిమాలను కొన్ని నిర్మాణ సంస్థలు పోటీపడి వందల కోట్ల రూపాయల భారీ బడ్జెట్లతో, ఏళ్ల తరబడి చిత్రీకరిస్తున్నాయని అన్నారు. కనీస సామాజిక స్పృహలేని ఆయా సినిమాల కలెక్షన్ల కోసం టికెట్ ధరలను పెంచాల్సిందిగా, ప్రత్యేక ప్రదర్శనలకు అనుమతి నివ్వాల్సిందిగా నిర్మాణ సంస్థలు ప్రభుత్వాలపై ఒత్తిడి తెస్తున్నాయని పేర్కొన్నారు. సినిమా రంగానికి తలొగ్గి ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా బెనిఫిట్ షోలు వేసేందుకు అనుమతించాయని చెప్పారు. ఈ విధానాలను సీపీఐ తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. పుష్ప 2 సినిమా విడుదల సందర్భంగా హైదరాబాద్ సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో రేవతి అనే మహిళ చనిపోవడంపై రామకృష్ణ విచారం వ్యక్తం చేశారు. రేవతి కుమారుడు శ్రీతేజ ఆపస్మారక స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడని అన్నారు. ఈ దుర్ఘటన తర్వాత ఇకపై తెలంగాణలో సినిమా టికెట్ల ధరలను పెంచబోమని, ప్రత్యేక ప్రదర్శనలకు అనుమతి ఇవ్వబోమని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారని తెలిపారు. తెలంగాణ తరహాలో ఏపీలో కూడా సినిమా టికెట్ల ధరలు పెంచబోమని, ప్రత్యేక ప్రదర్శనలకు అనుమతి ఇవ్వబోమనే ప్రకటన చేయాలని కోరారు.

## తెలుగు ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు: సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్..



అమరావతి: ప్రపంచవ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. భారత్‌లోనూ ముఖ్యంగా రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ క్రిస్మస్ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. తెల్లవారుజామునే పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు చర్చిలకు పెద్దఎత్తున వెళ్లి ప్రత్యేక ప్రార్ధనలు చేస్తున్నారు. చిన్న, పెద్దా తేడా లేకుండా క్రిస్టియన్లు అందరూ చర్చిలకు చేరుకున్నారు. దీంతో ప్రత్యేక పార్ధనలు చేస్తున్న పాస్టర్లు ఏసుక్రీస్తు బోధనలు, గొప్పతనాన్ని భక్తులకు వివరిస్తున్నారు. అయితే తెలుగు రాష్ట్రాలవ్యాప్తంగా ఉన్న క్రిస్టియన్ సోదరులకు పలువురు ప్రముఖులు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏపీ మంత్రి లోకేశ్, బీజేపీ ఏపీ అధ్యక్షురాలు పురందేశ్వరి సహా కూటమి నేతలు శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్, కేటీఆర్ సైతం చెప్పారు.తెలుగు ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుతూ ఎక్స్ వేదికగా సీఎం చంద్రబాబు ట్వీట్ చేశారు. సర్వ మానవాళికి శాంతి సందేశం ఇచ్చిన యుగకర్త ఏసుక్రీస్తు జన్మదినం ప్రపంచానికి పండగ దినమని సీఎం చంద్రబాబు అన్నారు. క్రిస్మస్ పర్వదినం సందర్భంగా క్రైస్తవ సోదర, సోదరీమణులకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. ప్రేమ మార్గంలో ఎవ్వరి మనస్సునైనా జయించవచ్చని తన జీవితం ద్వారా జీసస్ నిరూపించారని సీఎం కొనియాడారు. క్రీస్తు మార్గంలో నడుస్తూ సాటి మనిషికి మేలు చేయడమే అందరి ముందున్న కర్తవ్యమని ఆయన పేర్కొన్నారు. ప్రేమ, కరుణ, సహనం, దయ, త్యాగ గుణాలను అలవాటు చేసుకుని జీవితాన్ని శాంతిమయం చేసుకుందామని సీఎం పిలుపునిచ్చారు. సర్వ మానవాళికి మేలు కలగాలని ప్రభువును ప్రార్థిద్దామంటూ ఏపీ సీఎం చంద్రబాబు ట్వీట్ చేశారు.

## ఏపీని కలవరపెడుతున్న వరుస అల్పపీడనాలు.. కోస్తా, రాయలసీమలో వర్షాలు



అమరావతి : ఆంధ్రప్రదేశ్‌ను వరుస అల్పపీడనాలు కలవరపెడుతున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనం రానున్న 24 గంటల్లో పశ్చిమ నైరుతిగా పయనించి దక్షిణ కోస్తా తీరంవైపు వచ్చే క్రమంలో బలహీనపడుతుందని వాతావరణశాఖ అధికారులు పేర్కొన్నారు.తీవ్ర అల్పపీడనం కారణంగా గత వారం రోజులుగా ముసురు నెలకొని ఉండడంతో ప్రజలు, రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో భారీ వర్షాలు పడే అవకాశముందని వెల్లడించారు. ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో వర్షాలు పడుతయాని తెలిపారు.కాగా ప్రస్తుతమున్న అల్పపీడనం బలహీనపడుతున్న దశలో మరోటి ఏర్పడే అవకాశముందని వివరించారు. ఇటీవల కాలంలో బంగాళాఖాతంలో డిసెంబర్ నెలలో వరుస అల్పపీడనాలు ఏర్పడడం ఇదే తొలిసారి అని పేర్కొన్నారు.

## భరతజాతి గర్వించదగ్గ నేత అటల్ బిహారీ వాజ్‌పేయి

### వాజ్‌పేయికి నివాళి అర్పించిన ఏపీ సీఎం

అమరావతి,డిసెంబర్ 25 : భరత జాతి గర్వించదగిన నేత భారతరత్న అటల్ బిహారీ వాజ్ పేయి అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. బుధవారం అటల్ బిహారీ వాజ్ పేయి శతజయంతి సందర్భంగా ఆయనకు సీఎం చంద్రబాబు ఘననివాళులు అర్పించారు. ఢిల్లీలోని 'సదైవ్ అటల్' స్మారక చిహ్నం వద్ద మాజీ ప్రధానికి ఘటన నివాళులు అర్పించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్ కర్, ప్రధాని మోదీ, స్పీకర్ ఓం బిర్లా, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్ర మంత్రి, బీజేపీ చీఫ్ జేపీ నడ్డా, పలువురు కేంద్ర మంత్రులు సైతం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో అటల్ బిహారీ వాజ్ పేయిని ప్రశంసిస్తూ ఎక్స్ వేదికగా సీఎం చంద్రబాబు ట్వీట్ చేశారు. ఈ సందర్భంగా ఆయనతో కలిసి పనిచేసిన సందర్భాలను గుర్తు చేసుకున్నారు. దేశానికి వాజ్ పేయి చేసిన సేవలు స్మరించుకున్నారు. గతంలో ఆయనతో దిగిన ఫొటోను షేర్ చేశారు. "భారతజాతి గర్వించదగిన నేత, భారతరత్న అటల్ బిహారీ వాజ్ పేయి శతజయంతి సందర్భంగా ఘననివాళులు అర్పిస్తున్నా.

# సంపాదకీయం

గురువారం 26-12-2024

## సంభల్ రహస్యాలు......

సంభల్‌లో వరుసగా పురాతన కట్టడాలు బయటపడుతున్నాయి. ఇటీవల, సంభల్ మసీదు వివాదంలో చెలరేగిన అల్లర్ల తర్వాత సంభల్ చర్చనీయాంశమయ్యింది. ఆ తర్వాత జరిగిన పరిణామాల్లో సంభల్ సంచలనాలకు వేదికయ్యింది. నగరవ్యాప్తంగా జరుగుతున్న పలు తనిఖీల్లో పాత కాలంనాటి విశేషాలు ఒకొక్కటిగా బయటపడుతున్నాయి. మొన్న శివాలయం.. ఇవాళ 1857 సిపాయిల తిరుగుబాటులో వాడుకున్న సొరంగ బావి.. ఇలా ఇంకెన్ని రహస్యాలను సంభల్ దాచుకుందో అనే ఆసక్తి పెరిగింది. ఉత్తర్ ప్రదేశ్‌లోని సంభల్ సంచలనాలకు వేదికయ్యింది. ఇటీవల, సంభల్ మసీదు వివాదంతో మొదలైన అలజడితో ఆ ప్రాంతంలో పురాతన కట్టడాల వ్యవహారం ఆసక్తిని రేపింది. గత కొన్ని రోజులుగా అధికారులు చేస్తున్న వేర్వేరు తనిఖీల్లో పాత కాలం నాటి దేవాలయాలు, బావులు బయటపడుతున్నాయి. మైనారిటీ వర్గాలు నివశిస్తున్న ప్రాంతంలోనే ఈ సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. సంభల్ భూమిని తవ్వుతుంటే.. మట్టిలో విగ్రహాలు, శివలింగాలు, బావులు, సొరంగాలు వెలుగు చూస్తున్నాయి. ఇప్పుడిదే అంశం దేశవ్యాప్తంగా అతిపెద్ద చర్చకు దారితీసింది. ఇటీవల, ఓ పురాతన ఆలయం బయటపడింది. ఆలయంలో హనుమాన్ విగ్రహం కనిపించింది. ఆ విగ్రహం కిందనే శివలింగం బయటపడింది. ఎదురుగా నందివిగ్రహాలు కూడా ఉన్నాయి. డిసెంబర్ 14న ఆలయం వెలుగులోకి రాగానే మరుసటి రోజునుంచి పురాతన శివాలయాన్ని దర్శించడానికి భక్తులు పోటెత్తారు. ఈ ఆలయాన్ని పునరుజ్జీవనం చేసి.. పూజలు, హోమాలు నిర్వహించారు. దీని తర్వాత, మరో చోట ఆరవై ఏళ్లకు ముందు నాటి సొరంగం మార్గం? ఓ మెట్ల బావి కూడా కనిపించాయి. ఈ పరిణామాల మధ్య, మరోసారి సంభల్‌లో హిందూ సాంస్కృతి ఆనవాళ్లపై చర్చ రాజుకుంది. వెలుగు చూసిన ఓ సొరంగ మార్గం? బ్రిటీష్ రాజ్‌కి వ్యతిరేకంగా 1857 తిరుగుబాటు సమయంలో ఉద్యమ కారులు తప్పించుకోడానికి వాడిన సొరంగంగా భావిస్తున్నారు. అలాగే, 150 సంవత్సరాల నాటిదని నమ్ముతున్న ఒక మెట్ల బావి కూడా ఇదే ప్రాంతంలో కనపించింది. సంభాల్‌లోని చందౌసిలోని లక్ష్మణ్ గంజ్ ప్రాంతంలో ఆక్రమణలపై చేస్తున్న డ్రైవ్‌లో ఇవి కనిపించాయి. అయితే, అక్కడ కనపించిన మెట్ల బావి పేరు రాణీకి బావ్డీగా చెబుతున్నారు. ఇది, బాంకే బిహారీ ఆలయానికి సమీపంలో ఉంది. శిథిలావస్థకు చేరుకున్న ఈ నిర్మాణం.. ఈ ప్రాంతంలోని చారిత్రక ప్రదేశాలను వెలికితీసే ప్రయత్నంలో భాగంగానే కనిపెట్టినట్లు తెలుస్తోంది. పురావస్తు శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న తాజా సర్చ్ ఆపరేషన్లలో.. ఈ ప్రాంతంలోని భద్రక్ ఆశ్రమం, స్వర్గదీప్, చక్రపాణి పేర్లతో ఉన్న ఐదు పుణ్యక్షేత్రాలు, 19 పాత బావులను కూడా పరిశీలించినట్లు తెలుస్తోంది. అయితే, ఇప్పటి వరకూ కొనుగొన్న ఆలయాలు, మెట్లబావి, సొరంగ మార్గాలు ప్లాన్డ్‌గా కనుక్కున్నవి కాదనీ.. ఆక్రమణలపై జరుగుతున్న డ్రైవ్‌లో భాగంగానే కనిపించాయని అధికారులు చెబుతున్నారు. అయితే, ఈ ఆలయం వివాదాస్పద షాహీ జామా మసీదు నుంచి సుమారుగా వంద మీటర్ల దూరంలో ఉంది. నవంబర్ 24న కోర్టు ఆదేశాలతో మసీదు సర్వేకి వెళ్లిన సమయంలో అల్లర్లు మొదలయ్యాయి. ఈ ఘటనలో ఐదుగురు వ్యక్తులు మరణించారు. దీంతో సంభల్ దేశవ్యాప్తంగా చర్చకు దారి తీసింది. ఈ పరిణామం తర్వాత నుంచి ఆ ప్రాంతంలో ఆక్రమణలపై యోగి సర్కార్ ఉక్కుపాదం మోపింది. ఈ సందర్భంగానే పురాతన కట్టడాలు వెలుగులోకి వస్తున్నాయి. ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్ ఒక చిన్న పట్టణం. అయితే, ఈ ప్రాంతం చారిత్రకంగానూ ప్రఖ్యాతి చెందిన నగరం. ఆధ్యాత్మిక, పురాతన విశ్వాసాలతో నిండిన నగరం. ఇక్కడ మత విశ్వాసాలు కూడా అధికంగా కనిపిస్తాయి. మసీదులు, దేవాలయాలు ఎక్కువగా ఉంటాయి. వీటిలో ఇప్పటికీ కొన్ని స్మారక కట్టడాలు వందల సంవత్సరాల పాతవి, శతాబ్దాలుగా అవి అలాగే ఉండిపోయాయి. నారాయణుడు 24వ అవతారమైన కల్కి సంభాల్ లో అవతరిస్తారని శ్రీమద్ భగవత పురాణంలోని 12వ ఖండంలోని రెండవ అధ్యాయంలో ఉందని వేదపండితులు చెబుతుంటారు. కలియుగంలో దుష్టుల నాశనానికి ఈ అవతారం ఉండబోతో oదని అందులో రాసినట్లు చెబుతారు. సంభాల్‌లో 68 తీర్థయా త్రలు, 19 బావులు, 36 పురాలు, 52 సత్రాలు ఉండేవని అంటారు. ఆనవాళ్లు సంభాల్ నగరంలో ఇప్పటికీ ఉన్నాయి. మరోవైపు, సంభాల్‌లో నిర్మించిన మొట్టమొ దటి బాబ్రీ మసీదు.. ఈ చిన్న నగరంలో మొఘులుల శాశ్వత ప్రభావం ఎలా ఉందో చెప్పడానికి నిజమైన నిదర్శనంగా ఉంది. బాబ్రీ మసీదు అని పిలుచుకునే.. జామా మసీదు సంభాల్‌లోని పురాతన స్మారక కట్టడాలలో ఒకటి. ప్రస్తుతం ఇది వారసత్వ ప్రదేశం. ఈ మసీదు 1528లో బాబర్ చక్రవర్తి ఆదేశాల మేరకు నిర్మించబడింది. అయితే, చరిత్ర మొత్తం తవ్వి చూస్తే? ఈ నగరంలో మొఘులులకు ముందున్న సంస్కృతి చాలా బయటపడుతుందని అనడంలో సందేహం లేదు. మతపరమైన స్వభావాన్ని వివాదాస్పదం చేసే కేసుల్లో మతపరమైన నిర్మాణాలు లేదా సర్వేలకు ఎలాంటి ఆదే శాలు జారీ చేయవద్దని దేశంలోని దిగువ కోర్టులకు సుప్రీంకోర్టు ఆదేశించింది. ప్రస్తుతం అమల్లో ఉన్న ప్రార్ధనా స్థలాల చట్టం 1991కు ఉన్న రాజ్యాంగబద్ధతపై సుప్రీంకోర్టు విచారిస్తోంది. ఈ విచారణ పూర్తయ్యేవరకు మతపరమైన నిర్మాణాలు, స్వభావానికి సంబంధించి కొత్త వాజ్యాలు తీసుకోవద్దని సుప్రీంకోర్టు దిగువ కోర్టులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

## మహిళలను నమ్మించి మోసం చేసిన రేవంత్ రెడ్డి సర్కార్.. ఎమ్మెల్సీ కవిత ధ్వజం

హైదరాబాద్ : రేవంత్ రెడ్డి సర్కార్ మహిళలను నమ్మించి మోసం చేసిందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పాలనలో క్రిస్మస్ గిఫ్ట్, రంజాన్ తోఫా, బతుకమ్మ చీరల పంపిణీ ఎగిరిపోయాయని ఆమె ఎద్దేవా చేశారు. మెదక్ చర్చిని సందర్శించిన అనంతరం కవిత మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు.మహిళలకు నెలకు రూ. 2500 ఇస్తామని సీఎం ప్రకటిస్తారని మహిళలకు ఆశించారు. కళ్యాణ లక్ష్మీతో పాటు తులం బంగారం ఇస్తామని ప్రకటన చేస్తారని ఊహించారు. కానీ ప్రభుత్వం ఎటువంటి ఆలోచన చేయడం లేదు. రాష్ట్రంలోని ఒక్కో ఆడబిడ్డకు ప్రభుత్వం రూ. 30 వేలు బాకీ పడింది. 18 ఏళ్లు నిండిన ఆడపిల్లలకు స్కూటీ ఇవ్వలేదు. తక్షణమే స్కూటీల పంపిణీ కార్యక్రమాన్ని మొదలుపెట్టాలని కవిత డిమాండ్ చేశారురాష్ట్రంలో 40 శాతం నేరాలు పెరిగాయి. నేరాల పెరుగుదల.. ప్రభుత్వం మహిళల పట్ల చూపిస్తున్న నిర్లక్ష్యానికి నిదర్శనం. మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేసే సోయి ప్రభుత్వానికి లేదు. మహిళలు చూస్తూ ఊరుకోబోరు.. కచ్చితంగా ప్రశ్నిస్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు బంధును ఎగ్గొట్టింది. తక్షణమే రైతు భరోసా పథకాన్ని అమలు చేయాలి. రైతు భరోసా కింద అర్హులను తగ్గించే ప్రయత్నం చేయవద్దు. కేంద్ర ప్రభుత్వపు నిబంధలను అమలు చేస్తే 30 శాతం రైతులకు కూడా రైతు భరోసా రాదని కవిత పేర్కొన్నారు.మొక్కజొన్నలు, కందులు, సోయాబీన్, పత్తి వంటి పంటలను మద్దతు ధరను పెంచుతామని ఇచ్చిన హామీ ఏమైంది..? ఏడాది కాలంగా ఏ ఒక్క పంటకు మద్దతు ధర ఇవ్వడం లేదు. చక్కెర ఫ్యాక్టరీలను ఎప్పుడు ఓపెన్ చేస్తారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా రేషన్ కార్డులు ఇవ్వలేదు. ఇంట్లో ఎంత మంది ఉంటే అంత మందికి రేషన్ బియ్యం పంపిణీ చేయాల్సిందే.తెలంగాణకు తలమానికం మెదక్ చర్చి. బీఆర్ఎస్ పార్టీకి, కేసీఆర్‌కు క్రైస్తవులకు పేగుబంధం ఉంది. తెలంగాణ కోసం ప్రార్థన చేయని చర్చి లేదు. మత సహనానికి నిదర్శనం మెదక్. మెదక్ జిల్లాను కేసీఆర్ ఎంతో అభివృద్ధి చేశారు. కేసీఆర్ గోదావరి జలాలతో సింగూరును నింపారు. మెదక్‌కు నీళ్లు వచ్చే కాళేశ్వరం ప్యాకేజీ 19 పనులను ప్రభుత్వం నిలిపివేడయం దారుణం. కేసీఆర్‌పై కోపాన్ని మెదక్ ప్రజలపై తీర్చుకుంటే ఏమొస్తుంది..? కాళేశ్వరం ప్యాకేజీ 19 పనులను కొనసాగించాలి అని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు.


## కజకిస్థాన్ విమాన ప్రమాదంలో 42 మంది దుర్మరణం..!



కజకిస్థాన్‌లో జరిగిన విమాన ప్రమాదంలో 42 మంది మరణించినట్లు అక్కడి అధికారులు వెల్లడించారు. మొత్తం 25 మందిని ప్రాణాలతో బయటికి తీసుకొచ్చినట్లు తెలిపారు. వారిలో 11 ఏళ్ల బాలిక, 16 ఏళ్ల బాలుడు సహా ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయని, వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారని చెప్పారు. ప్రమాదానికి గురైన సమయంలో విమానంలో 62 మంది ప్రయాణికులు, ఐదుగురు సిబ్బంది సహా 67 మంది ఉన్నట్లు అధికారులు తెలియజేశారు.కజకిస్థాన్‌లోని అక్టౌ నగరలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. అజర్‌బైజాన్ ఎయిర్‌లైన్స్ కు చెందిన విమానం అజర్‌బైజాన్‌లోని బాకు నుంచి రష్యాలోని గ్రోజ్నీ కి వెళ్తుండగా ప్రమాదానికి గురైంది. గ్రోజ్నీలో దట్టమైన పొగమంచు కారణంగా విమానాన్ని 1800 కిలోమీటర్ల దూరంలోగల కజకిస్థాన్లోని అక్టౌ విమానాశ్రయానికి మళ్లించారు.ఆక్టౌ విమానాశ్రయంలో ఎమర్జెన్సీ ల్యాండింగ్‌కు పైలట్ ప్రయత్నించారు. అందుకోసం ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ అనుమతి కోరారు. ఇంతలో విమానం ఆక్టౌ విమానాశ్రయం పైకి వచ్చి చక్కెర్లు కొడుతూ కుప్పకూలింది. కూలడానికి ముందు విమానం పలుమార్లు కిందకు వచ్చి, పైకి వెళ్లడాన్ని చూస్తుంటే అందులో ఆఖరి నిమిషాల్లో ఏదో సాంకేతిక లోపం తలెత్తినట్లు తెలుస్తోంది.ప్రమాదం జరగగానే కజకిస్థాన్‌కు చెందిన రెస్క్యూ టీమ్స్ ఘటనా ప్రాంతానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. విమానం నుంచి 25 మంది ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీశారు. వారిలో తీవ్రంగా గాయపడిన ఐదుగురిని చికిత్స నిమిత్తం హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. మరో 42 మంది మృతదేహాలను వెలికితీశారు.

## బీజేపీకి పిచ్చిపట్టింది.. ఆ పార్టీ నేతల బుర్రలు పనిచేయడంలేదు : సంజయ్ సింగ్

భారతీయ జనతా పార్టీ పై ఆమ్ ఆద్మీ పార్టీ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు సంజయ్ సింగ్ తీవ్ర విమర్శలు చేశారు. బీజేపీకి పిచ్చిపట్టిందని, ఆ పార్టీ నేతల బుర్రలు పనిచేయడం లేదని ఫైరయ్యారు. 'మహిళా సమ్మాన్ యోజన ' పథకం అమలులో లేదని, ఇకముందు కూడా అమలు చేయబోవడం లేదని ఢిల్లీకి చెందిన మహిళాశిశు సంక్షేమ శాఖ మంగళవారం ఒక పబ్లిక్ నోటీస్‌ను విడుదల చేసింది. దీనిపై బీజేపీ విమర్శలు గుప్పిస్తుండటంతో సంజయ్ సింగ్ స్పందించారు.బీజేపీ ఒక అబద్ధాలకోరు పార్టీ అని, ఆ పార్టీ పనిగట్టుకుని తప్పుడు ప్రచారం చేస్తున్నదని ఆప్ నేత మండిపడ్డారు. బీజేపీ నేతల ఒత్తిడికి తలొగ్గి, ప్రభుత్వాన్ని బదనాం చేసేలా పబ్లిక్ నోటీస్ విడుదల చేసిన అధికారులపై చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఢిల్లీ ప్రజలు బీజేపీ నేతల తప్పుడు ప్రచారాలను నమ్మబోరని చెప్పారు. కేజ్రీవాల్ సీఎంగా ఉన్నప్పుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారని, బీజేపీ మాత్రం కేంద్రంలో ఒక్క హామీని కూడా నిలబెట్టుకోలేదని విమర్శించారు.'బీజేపీకి పిచ్చిపట్టింది. బీజేపీ నేతల మెదళ్లు పనిచేయడంలేదు. బీజేపీ నేతల ఒత్తడికి తలొగ్గి తప్పుడు పబ్లిక్ నోటీస్ రిలీజ్ చేసిన అధికారులపై చర్యలు తీసుకుంటాం. కేజ్రీవాల్ ఢిల్లీ సీఎంగా.. ఉచిత విద్యుత్, ఉచిత తాగునీరు, ఉచిత విద్య, ఉచిత వైద్యం అందుబాటులోకి తెచ్చారు. కేజ్రీవాల్ ఇచ్చిన హామీ మేరకు మహిళా సమ్మాన్ యోజన పథకం కూడా అమల్లోకి వస్తుంది. ఈ పథకం కేవలం హామీ కాదు. ఒక గ్యారంటీ' అని చెప్పారు.'భారతీయ ఝూటా పార్టీ (బీజేపీని ఉద్దేశించి) ఎన్నికల్లో ఎన్నో హామీలు ఇచ్చింది. విదేశీ బ్యాంకుల్లో ఉన్న బ్లాక్ మనీని బయటికి తీసుకొస్తామని చెప్పింది. రెండు కోట్ల ఉద్యోగ నియామకాలు చేపడుతామని ప్రచారం చేసింది. ఒక్కొక్కరి ఖాతాలో రూ.15 లక్షలు జమచేస్తామని తెలిపింది. కానీ వాటిలో ఏ ఒక్క హామీని కూడా బీజేపీ నెరవేర్చలేదు. దేశాన్ని నాశనం చేశారు. పైగా వాళ్లు అబద్ధాలు ప్రచారం చేస్తారు. వాళ్ల అబద్ధాలను జనం నమ్మే పరిస్థితిలో లేరు' అని సంజయ్ సింగ్ అన్నారు.



## రేపిస్టులు, హంతకులను క్షమించేది లేదు.. వారికి మరణ శిక్షే : డొనాల్డ్ ట్రంప్



అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ మరికొన్ని రోజుల్లో అధ్యక్ష బాధ్యతల నుంచి వైదొలగనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తనకున్న అధికారాలతో వివిధ కేసుల్లో శిక్ష అనుభవిస్తున్న అనేక మందికి క్షమాభిక్ష ప్రసాదిస్తున్నారు. ఇందులో భాగంగానే రెండు రోజుల క్రితం ఫెడరల్ మరణశిక్షను ఎదుర్కొంటున్న 40 మంది ఖైదీల్లో 37 మందికి శిక్ష తగ్గించిన విషయం తెలిసిందే.అయితే, బైడెన్ చర్యను కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ( తీవ్రంగా ఖండించారు. ఫెడరల్ ఖైదీల విషయంలో కఠినంగా ఉండాలని స్పష్టం చేశారు. తాను బాధ్యతలు చేపట్టాక అలాంటి వారిని క్షమించే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. తాను అధ్యక్ష బాధ్యతలు చేపట్టాక రేపిస్టులు, హంతకులకు మరణ శిక్ష అమలు చేస్తానని స్పష్టం చేశారు. ఈ విషయంపై న్యాయ శాఖను ఆదేశిస్తానని తెలిపారు. దేశంలో మళ్లీ శాంతి భద్రతలను పునరుద్ధరిస్తానని వెల్లడించారు.మరణశిక్షలకు సంబంధించి అమెరికాలో ఆయా రాష్ట్రాల్లో వేర్వేరు నిబంధనలు ఉన్నాయి. మొత్తం 50 రాష్ట్రాల్లో 23 రాష్ట్రాలు మరణశిక్షను రద్దు చేశాయి. మరో ఆరు రాష్ట్రాలు తాత్కాలికంగా నిలిపివేశాయి. మిగతా రాష్ట్రాల్లో మరణశిక్ష అమలవుతోంది. అయితే, తోటి ఖైదీలను హతమార్చిన వారికి, బ్యాంకు దోపిడీల సమయంలో హత్యలు చేసిన వారికి మరణ శిక్ష విధిస్తున్నాయి. 1988 నుంచి ఇప్పటి వరకు 79 మందికి న్యాయస్థానాలు మరణశిక్ష విధించగా.. కేవలం 16 మందికి మాత్రమే శిక్ష అమలు చేశారు. అందులోనూ ట్రంప్ తొలిసారి ప్రెసిడెంట్ అయ్యాక ఆరు నెలలలోనే 13 మందికి మరణ శిక్ష అమలు చేశారు. ప్రస్తుతం మరణ శిక్ష పడిన ఖైదీల సంఖ్య 40 ఉండగా.. వీరిలో 37 మందికి తాజాగా బైడెన్ క్షమాభిక్ష ప్రసాదించారు

## త్వరలో ఢిల్లీ సీఎం అతిశీని అరెస్ట్ చేస్తారు : అరవింద్ కేజ్రీవాల్



న్యూఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సంచలన ఆరోపణలు చేశారు. త్వరలో ఢిల్లీ సీఎం అతిశీని అరెస్ట్ చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా కేజ్రీ ట్వీట్ పెట్టారు.త్వరలో జరగబోయే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఆప్ ప్రభుత్వం రెండు రోజుల క్రితం మహిళా సమ్మాన్ యోజన, సంజీవన యోజన పథకాలను ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ పథకాలు ప్రకటిండచం కొందరికి నచ్చలేదని కేజ్రీవాల్ పేర్కొన్నారు. ఇందులో భాగంగానే సీఎం అతిశీని తప్పుడు కేసులో అరెస్ట్ చేయాలని ప్లాన్ చేస్తున్నారని ఆరోపించారు. అంతకంటే ముందు పలువురు ఆప్ నేతల ఇళ్లలో సోదాలు జరగొచ్చని పేర్కొన్నారు.

## రేషన్ కార్డు కొత్త రూల్.. దేశ వ్యాప్తంగా రేషన్ కార్డు ఉన్న వారికీ 5 కొత్త రూల్స్

హైదరాబాద్,మన ప్రభుత్వం రేషన్ కార్డ్ కొత్త నిబంధనలను ప్రవేశపెట్టింది మరియు రేషన్ కార్డు దారులందరూ వాటిని పాటించడం తప్పనిసరి. ఈ నియమాలు జనవరి 1, 2025 నుండి అమలు చేయబడతాయి. మీరు రేషన్ కార్డ్ హోల్డర్ అయితే, మీరు కొత్త నిబంధనల గురించి తెలుసుకోవడం ముఖ్యం.అదనంగా, ప్రభుత్వం రేషన్ పంపిణీ వ్యవస్థ కోసం కొత్త నిబంధనలను ఏర్పాటు చేసింది. రేషన్ కార్డుదారులు ఇ-కెవైసి ని పూర్తి చేయడం ఇప్పుడు తప్పనిసరి. సకాలంలో ఈ కేవైసీ పూర్తి చేయని వారి పేర్లు రేషన్ కార్డు జాబితా నుండి తొలగించ బడతాయి.

రేషన్ కార్డ్ కొత్త రూల్స్ 2025,

మీరు ప్రభుత్వ దుకాణాల నుండి సబ్సిడీ సరుకులను స్వీకరిస్తే, రేషన్ కార్డు కొత్త నిబంధనల గురించి తెలుసుకోవడం ముఖ్యం. జనవరి 1, 2025 నుండి, ప్రభుత్వం రేషన్ కార్డ్ స్కీం కింద, కొత్త రూల్స్ లను అమలు చేస్తుంది. రేషన్ పంపిణీ వ్యవస్థను పూర్తిగా పారదర్శకంగా చేయడమే ఈ నిబంధనల ప్రధాన లక్ష్యం.

కొత్త నిబంధనల ప్రకారం, ఏ పౌరుడు రేషన్ కార్డు పథకాన్ని దుర్వినియోగం చేయలేరు. అవసరమైన వారికి మాత్రమే ప్రభుత్వ సహకారం అందుతుంది. దీన్ని నిర్ధారించడానికి, ప్రభుత్వం రేషన్ కార్డు దారులందరికీ ని ఇ-కేవైసీ తప్పనిసరి చేసింది.

రేషన్ కార్డ్ కొత్త రూల్స్ ఇ- కేవైసీ,

కొత్త నిబంధనల ప్రకారం, మీరు ఇకపై మునుపటి మాదిరిగానే రేషన్ అందుకోలేరు. ఇప్పుడు, మీరు మరింత సమతుల్య మరియు పోషకమైన ఆహారాన్ని అందుకుంటారు. ఉదాహరణకు, మీరు ఇంతకు ముందు 3 కిలోల బియ్యం మరియు 2 కిలోల గోధుమలు పొందేవారు, కానీ ఇప్పుడు పరిమాణం సవరించ బడింది.

కొత్త నిబంధనల ప్రకారం, మీరు ఇప్పుడు 2.5 కిలోల బియ్యం మరియు 2.5 కిలోల గోధుమలను అందుకుంటారు. అదనంగా, ఇప్పుడు రేషన్ కార్డు దారులందరికీ ఇ-కెవైసి తప్పనిసరి చేయబడింది. మీరు మీ ఇ-కేవైసీ ని గడువులోగా పూర్తి చేయాలి, అంటే డిసెంబర్ 31, 2024.

ఈ వ్యవధిలో మీరు మీ ఇ- కేవైసీ పూర్తి చేయకుంటే, మీరు రేషన్ కార్డ్ పథకం ప్రయోజనాలను కోల్పోవచ్చు.

## కరెంట్ చార్జీల బాదుడుపై వైయస్ఆర్ సిపి పోరుబాట కరపత్రం విడుదల వైయస్ఆర్ సిపి



ఎమ్మిగనూరు నియోజవర్గ ఇంచార్జ్ శ్రీమతి బుట్టా రేణుక ఆదేశాల మేరకు బుట్టా శివ నీలకంఠ ఆధ్వర్యంలోవిభారే న్యూస్. డిసెంబర్ 25. ఎమ్మిగనూరుఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి/వైయస్ఆర్ సిపి అధినేత శ్రీ వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన 6 నెలల్లో పెంచిన కరెంట్ చార్జీల బాదుడుపై ఎలక్షన్ ముందు పెంచను అని హామీ ఇచ్చి మాట మార్చిన కూటమి ప్రభుత్వం మీద పోరుబాటకు సిద్ధం కావాలని వైయస్ఆర్ సిపి ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీమతి బుట్టా రేణుక ఆదేశాల మేరకు బుట్టా శివ నీలకంఠ పార్టీ అనుబంధ విభాగాల వీర శైవ లింగాయత్ రాష్ట్ర అధ్యక్షుడు వై రుద్ర గౌడ్ గారు,బి.ఆర్ బసిరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం రోజున స్థానిక పార్టీ కార్యాలయం నందు 27వ తేదిన అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో చేపట్టనున్న కరెంట్ చార్జీల బాదుడుపై వైయస్ఆర్ సిపి పోరుబాట కరపత్రాలను విడుదల చేశారు. 27 న జరిగే పోరుబాట కార్యక్రమానికి వైయస్ఆర్ సిపి శ్రేణులు, రైతులు కలిసి వచ్చి పోరుబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా కోరడమైనది

## జిల్లాలో గురువారం 20 గ్రామాలలో రెవెన్యూ సదస్సుల నిర్వహణ

విభారే న్యూస్..కర్నూలు,ప్రతినిధి డిసెంబర్ 25 :– జిల్లాలో గురువారం 20 ఆ గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నారు...ఆదోని రెవెన్యూ డివిజన్ లోని గోనెగండ్ల మండలంలోని పెద్ద మర్రివీడు గ్రామం, నందవరం మండలంలోని జోహారపురం గ్రామం, ఎమ్మిగనూరు మండలంలోని కందనాతి గ్రామం,కోసగి మండలం లోని సజ్జలగూడెం గ్రామం, కౌతాళం మండలంలోని పోడలకుంట గ్రామం,మంత్రాలయం మండలంలోని బసాపురం గ్రామం, ఆదోని మండలంలోని కపటి గ్రామం, కోసగి మండలం లోని ఎండపల్లి గ్రామం, హోలగుంద మండలంలోని హోళగుంద గ్రామం, కౌతాళం మండలంలోని మదిరి గ్రామం.కర్నూలు రెవెన్యూ డివిజన్లోని ఓర్వకల్లు మండలంలోని తిప్పయ్య పల్లి గ్రామం, కల్లూరు మండలంలోని బస్తిపాడు గ్రామం, వెల్దుర్తి మండలం లో నర్లాపురం గ్రామం, కర్నూలు రూరల్ లోని ఎదురూరు గ్రామం,పత్తికొండ రెవెన్యూ డివిజన్లోని తుగ్గలి మండలంలోని తుగ్గలి గ్రామం, ఆలూరు మండలంలోని కమ్మరిచేడు గ్రామం, చిప్పగిరి మండలంలోని ఖాజాపురం గ్రామం,ఆస్పరి మండలంలోని తురువగల్ గ్రామం,హాలహర్వి మండలంలోని గుల్యం గ్రామం, జె కొసల్లి గ్రామం,లలో మొత్తము 20 గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నారు...

## మాజీ కౌన్సిలర్ ఆత్మీయ విందులో మంత్రి ఎన్ఎండి ఫరూక్---

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 25--నంద్యాల స్థానిక తోట లైన్ ఏరియాలో క్రిస్మస్ సందర్భంగా మాజీ కౌన్సిలర్ దేవరపాటి రవికుమార్ ఏర్పాటుచేసిన ఆత్మీయ విందులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ పాల్గొన్నారు . అనంతరం వారు మాట్లాడుతూ క్రిస్మస్ పండుగను అందరూ సుఖసంతోషాలతో సంతోషంగా జరుపుకోవాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మాజీ కౌన్సిలర్ మిద్దె చిన్న హుసేని , ఉప్పరి సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# క్రీస్తు జననం మానవాళికి పర్వదినం



విభారే న్యూస్.. కర్నూల్ ప్రతినిధి... డిసెంబర్ 25 క్రీస్తు జననం మానవాళికి పర్వదినమని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ,తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు మాజీ సభ్యులు పరిగెల మురళీకృష్ణ గారు అభిప్రాయపడ్డారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన క్రిస్మస్ పండుగ సందర్భంగా పార్టీ నాయకులు కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. జిల్లా కాంగ్రెస్ సాంస్కృతిక విభాగం మాజీ అధ్యక్షులు కురవ నాగశేషు ఏసుక్రీస్తు కీర్తనలు ఆలపించారు. అనంతరం మురళీకృష్ణ మాట్లాడుతూ క్రీస్తు జన్మించిన రోజు

**జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పరిగెల మురళీకృష్ణ**

ప్రపంచానికి పండుగ దినమని ప్రేమ మార్గంలో ఎవరి మనసు అయిన జయించవచ్చని, తన జీవితం ద్వారా నిరూపించిన క్రీస్తు మార్గంలో నడుస్తూ.. సాటి మనిషికి మేలు చేయడమే మన ముందున్న కర్తవ్యమని, ప్రేమ, కరుణ, సహనం, త్యాగం, గుణాలు అలవాటు చేసుకుని జీవితాన్ని శాంతిమయం చేసుకుందామని తెలియజేశారు. సర్వ మానవాళికి శాంతి సందేశాన్ని ఇచ్చిన యుగకర్త ఏసుక్రీస్తు జన్మించిన రోజు ప్రపంచానికి పండుగ రోజు అని పేర్కొన్నారు. క్రీస్తు మార్గాన్ని అనుసరించే వారందరికీ ప్రేమ పూర్వక క్రిస్మస్ శుభాకాంక్షలు మురళీకృష్ణ గారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎన్ సీ బజారన్న, కే సత్యనారాయణ గుప్త, ఎన్ చంద్రశేఖర్, ఎస్ ప్రమీల, డివి సాంబశివుడు, షేక్ ఖాజా హుస్సేన్, షేక్ ఖాద్రి పాషా, సయ్యద్ నవీద్, కె నాగశేషు, బి సుబ్రహ్మణ్యం డబ్ల్యూ సత్యరాజు, అక్బర్ అక్బర్, నరసింహులు, రుక్సాన మొదలగు వారు పాల్గొన్నారు.

## భారతరత్న యుగ పురుషునీ యుగ జయంతి :- వేల్పులగోపాల్





విభారే న్యూస్.. కర్నూల్ ప్రతినిధి. డిసెంబర్ 25భారతరత్న శ్రీఅటల్ బిహారీ వాజ్ పేయి గారి 100 వ జయంతి సందర్భంగా సుపరిపాలన దినోత్సవం పత్తికొండ అసెంబ్లీ వెల్దుర్తి మండలంలో నిర్వహించిన కార్యక్రమంలో కర్నూలు జిల్లా సభ్యత్వ ప్రముఖ్ దేశాయిచంద్రన్న వేల్పులగోపాల్ లు మాట్లాడుతూ గల్లి నుండి ఢిల్లీ దాక కాశ్మీర్ నుండి కన్యాకుమారి దాక రొడ్ నిర్మాణ పనులు మరియు ప్రతి గ్రామంలో అంగన్ వాడి సెంటర్లు ఏర్పాటు సి సి రోడ్లు చేసిన ఘనత శ్రీ వాజపేయి కే దక్కిందన్నారు ఈకార్యక్రమంలో కోటియాదవ్ సాయిప్రదిప్ నవీన్ వెల్దుర్తి ప్రధాన కార్యదర్సులు వి.షేక్షావలి బి.బాలకృష్ణ కుమ్మరిరామకృష్ణ జి.నాగరాజు మహిళ అధ్యక్షురాలు లాలీతభాయ్ బి.వెంకటేష్ రెడ్డి అనంతరం క్రిష్ణగిరి మండల అధ్యక్షులు చిందుకూరి రామలింగమ్ కిసాన్ మోర్చా అధ్యక్షులు కురువసురేంద్ర జి.వి.చలపతిరావు బీజేవైఎం అధ్యక్షులు బోయగిడ్డయ్య చిందుకూరి వీరాంజనేయులు బోయసుధాకర్మరియు తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహిళలకు ఫ్రీ బస్సు అడుగులు




గుంటూరు, డిసెంబర్ 25, మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణంపై కూటమి ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. క్యాబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు అయ్యింది. రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి చైర్మన్ గా,మహిళా మంత్రులు గుమ్మిడి సంధ్యారాణి, వంగలపూడి అనితలు సభ్యులుగా ఏర్పాటైన ఈ కమిటీ ఉచిత ప్రయాణం పై అధ్యయనం చేస్తోంది.ఇప్పటికే ప్రాథమిక అంచనాలను సైతం సిద్ధం చేసింది. ఇప్పటికే ఈ పథకం అమలు అవుతున్న కర్ణాటక,తెలంగాణలో ఉచిత ప్రయాణం పై అధ్యయనం చేసింది ఈ కమిటీ. ఒక నివేదిక తయారు చేసి వీరు రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించనున్నారు.అయితే ప్రభుత్వం ఇప్పటికే ప్రాథమికంగా కొన్ని అంచనాలను రూపొందించినట్లు తెలుస్తోంది.ఈ పథకానికి సంబంధించి కీలక అంశాలు కూడా ఉన్నాయి. ప్రయాణించే వారితో పాటు అదనంగా బస్సులు, సిబ్బంది నియామకం సైతం పూర్తి చేయాల్సి ఉంటుంది.కర్ణాటకలో మహిళలకు ఉచిత ప్రయాణం పై కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది.దీంతో అక్కడి మహిళలు కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకు రాగలిగారు.తెలంగాణలో సైతం కాంగ్రెస్ పార్టీ ఇదే హామీ ఇచ్చింది.అధికారంలోకి రాగలిగింది. ఈ రెండు రాష్ట్రాల్లో ఇప్పుడు మహిళలకు ఉచిత ప్రయాణ పథకం అమలవుతోంది. అయితే ఈ పథకం అమల్లోకి వచ్చిన తర్వాత ఆ ప్రభుత్వాల రవాణా వ్యవస్థ పై భారం పడింది. ఏపీలో కూడా పెను భారం తప్పదని తెలుస్తోంది.ఈ పథకం అమలు చేస్తే రోజుకు సగటున పది లక్షల మంది మహిళా ప్రయాణికులు బస్సుల్లో రాకపోకలు సాగిస్తారని ప్రభుత్వం అంచనా వేస్తోంది.ఈ పథకం అమలు చేయడానికి అదనంగా మరో రెండు వేల బస్సులు అవసరం అవుతాయని..11వేలమంది సిబ్బందిని నియమించాల్సి ఉంటుందని అంచనాకు వచ్చారు.వాస్తవానికి రోజుకు సగటున ఆర్టీసీ బస్సుల్లో 27 లక్షల మంది ప్రయాణిస్తుంటారని అంచనాలు ఉన్నాయి. అందులో పది లక్షల మంది వరకు మహిళలే ఉంటారని మంత్రుల సబ్ కమిటీ గుర్తించినట్లు సమాచారం.రాష్ట్రంలో ప్రస్తుతం ఆర్టీసీ బస్సుల్లో ఆక్యుపెన్సి 68 నుంచి 69 శాతం వరకు ఉంది. ఈ పథకం అమలు చేస్తే 95 శాతానికి పెరుగుతుంది.అదే జరిగితే అదనంగా బస్సులు వేయాల్సి ఉంటుంది.ప్రస్తుతం సూపర్ లగ్జరీ, అల్ట్రా డీలక్స్,ఎక్స్ప్రెస్, అల్ట్రా పల్లె వెలుగు, పల్లె వెలుగు వంటి ఐదు రకాల సర్వీసులు నడుస్తున్నాయి.మహిళా ప్రయాణికుల పెరుగుతున్న దృష్ట్యా.. ఈ ఐదు రకాల సర్వీసులకు సంబంధించి రెండు వేల బస్సులు అవసరం.ఈ బస్సులకు సంబంధించి ఐదువేల మంది డ్రైవర్లు, 5000 మంది కండక్టర్లు, 1500 మంది మెకానిక్లను నియమించాల్సి ఉంటుంది.అంటే 11,500 మందిసిబ్బంది అవసరం అన్నమాట.మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తే ఆర్టీసీకి నెలకు 200 కోట్ల రూపాయలు ఆదాయం పడిపోయే అవకాశాలు కూడా ఉన్నాయి.ఇటువంటి తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం మహిళలకుఉచిత ప్రయాణం విషయంలో ఎటువంటి మార్గదర్శకాలు విడుదల చేస్తుందో చూడాలి.

# కొత్త డీజీపీ, సీఎస్ ఎవరు...

విజయవాడ, డిసెంబర్ 25, ఆంధ్రప్రదేశ్లో కొత్త సంవత్సరంతో పాటే.. కొత్త ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీలు కూడా రానున్నారు. ప్రస్తుత సీఎస్ నీరబ్కుమార్, డీజీపీ ద్వారకా తిరుమలరావు పదవీకాలం ఈ నెలతో పూర్తవుతుండడంతో.. కొత్త సీఎస్, డీజీపీ కోసం కసరత్తు మొదలుపెట్టారు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు. ప్రభుత్వ లక్ష్యాలు, ప్రాధాన్యాలను పకడ్బందీగా అమలు చేసే అధికారుల కోసం ఏపీ సీఎం అన్వేషిస్తున్నట్లు తెలుస్తోంది. మరి ఈ లిస్ట్లో ఉన్నది ఎవరు..? వినిపిస్తున్న పేర్లు ఏంటి..? అన్నదీ ఆసక్తికరంగా మారింది.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్తో పాటు డీజీపీ ద్వారకా తిరుమలరావు డిసెంబర్ నెలాఖరుకు రిటైర్ కాబోతున్నారు. సీఎస్ నీరబ్ కుమార్కు ఇప్పటికే పొడిగింపు ఇవ్వగా, మరోసారి ఛాన్స్ లేదన్న వార్తలు వినిపిస్తున్నాయి. దీంతో ఆయన స్థానంలో కొత్త అధికారిని నియమించే అవకాశాలు కనిపిస్తున్నాయి. అదేవిధంగా డీజీపీ ద్వారకా తిరుమలరావు కూడా రిటైర్ కాబోతున్నందున కొత్తగా మరో సీనియర్ ఐపీఎస్ను డీజీపీగా నియమించే ఛాన్స్ ఉందంటున్నారు. దీంతో ముఖ్యమంత్రి ఛాయిస్గా ఎవరిని ఎంపిక చేస్తారనే ఆసక్తి నెలకుంది.ఈ నెలాఖరుతో ఉద్యోగ విరమణ చేస్తున్న సీఎస్ నీరబ్ కుమార్ ప్లేస్కోసం ముగ్గురు సీనియర్ అధికారులు పోటీపడుతున్నారు. ఈ ముగ్గురిలో విజయానంద్, సాయి ప్రసాద్, ఆర్పీ సిసోడియా పేర్లు పరిశీలనలో ఉన్నట్టు తెలుస్తోంది. వీరి పదవీకాలం ఆధారంగా ఎవరిని నియమించాలనే విషయమై ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

## ఇలా ఉంటే... రోగాలు వెంటే



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 25-- ఊరూరా ఆసుపత్రి నిర్మించి ప్రజారోగ్యం మెరుగు పరిచినా.. మళ్లీ రోగాలు ప్రబలే అవ కాశం ఉందనడానికి ఈ చిత్రాలే సాక్ష్యం. ఉన్నతా ధికారుల ఆదేశాలతో ఎక్కడో ఓ మూలన పారిశు ద్ధ్య పనులు చేపట్టి చిత్రాలు తీసుకొని పలువురు అధికారులు మమ అనిపిస్తున్నారు. మహానంది గ్రామంలో పార్వతీపురం కాలనీలో పారిశుద్ధ్యం అధ్వా నంగా ఉందనడానికి ఈ చిత్రాలు నిర్లక్ష్యానికి నిలు వుటద్దం. నిల్వ ఉన్న వ్యర్థాలు కుళ్లిపోయి భరింపరాని దుర్వాసన వస్తోందని స్థానికులు వాపోతున్నారు. అధికా రులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరు తున్నారు. –

## బాక్సింగ్ పోటీలలో పతకాలు

**అభినందించిన డాక్టర్ రవి కృష్ణ.**



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 25-- బాక్సింగ్ పోటీలలో పతకాలు సాధించిన నంద్యాల క్రీడాకారులను డాక్టర్ రవి కృష్ణ అభినందించారు . కోయలకుంట్ల లో సోమవారం ఏ ఎన్ కె ఇంగ్లీష్ మీడియం స్కూల్లో నిర్వహించిన ఆహ్వాన ప్రాంతీయ బాక్సింగ్ పోటీలలో నంద్యాల జిల్లా బాక్సింగ్ అకాడమీ క్రీడాకారులు 11 మంది వివిధ వయసు కేటగిరీలలో బంగారు పతకాలు సాధించారు. ఈ సందర్భంగా బుధవారం కళారాధన కార్యాలయంలో ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు, ఉమ్మడి కర్నూలు జిల్లా మాజీ ఒలింపిక్ కమిటీ చైర్మన్ డాక్టర్ రవి కృష్ణ విజేతలను,శిక్షణ ఇచ్చిన సర్దార ఖాన్,షా నవాజ్ ఖాన్ లను అభినందించారు.ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ బాక్సింగ్ లో చిన్నారులు ఆసక్తి కనపరచడం అభినందనీయమని, భవిష్యత్తులో రాష్ట్ర,జాతీయ స్థాయి పోటీలలో కూడా పాల్గొనడానికి అవసరమైన తర్ఫీదు పొంది, నిరంతర సాధన ద్వారా విజయాలు సాధించాలని, అందుకు అవసరమైన సహాయ సహకారాలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు సోమేశుల నాగరాజు, నంద్యాల జిల్లా బాక్సింగ్ అకాడమీ సంయుక్త కార్యదర్శి సర్దార్ ఖాన్, కార్యవర్గ సభ్యుడు షానవాజ్ ఖాన్, పతకాలు సాధించిన క్రీడాకారులు పాల్గొన్నారు. పతకాలు సాధించిన క్రీడాకారులుజిలాన్,ఆదిల్, చేతన్, తన్వీర్, ముబాశిర, దేవాన్ష్, రితిక, ఆసిద్,ఆఫ్రా ,మంజునాథ్, అజయ్ లు వివిధ వయస్సు కేటగిరీలలో స్వర్ణ పతకాలు, ప్రశంస పత్రాలు అందుకున్నారు.

## హిజ్రాతో కుమారుడి ప్రేమ---

**భరించలేక తల్లిదండ్రుల ఆత్మహత్య---**

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 25 – – హిజ్రాతో కుమారుడి ప్రేమ వ్యవహారం భరించలేక తల్లిదండ్రులు ఆత్మహత్య చేసుకున్నారు . సుబ్బరాయుడు సరస్వతి ది స్వంతగ్రామం మహానంది మండలం గోపవరం ఇరువురు బతుకుదెరువు కోసం నంద్యాల కు వలస వచ్చిన వారు. నంద్యాల ఎస్బిఐ కాలనీలో ఇండ్లు అద్దెకు తీసుకొని పూల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. సరస్వతి, సుబ్బరాయుడుల కుమారుడు సునీల్ ఆటో నడుపుతూ ఓ హిజ్రాతో ప్రేమలో పడ్డాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు కుమారుడిని బంధువుల ఇంటికి పంపారు. అప్పటి నుంచి హిజ్రాలు సుబ్బరాయుడు దంపతులను వేధింపులకు గురిచేస్తున్నారు. కుమారుడూ హిజ్రానే పెళ్లి చేసుకుంటానని పట్టుపట్టడంతో మనస్తాపం చెంది ఇరువురు ఆత్మహత్యకు పాల్పడి మృతిచెందారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**